క్లుప్తంగా

క్షేత్రస్థాయి సందర్శన



ఫైర్‌స్టేషన్‌ను సందర్శిస్తున్న విద్యార్థులు

విద్యానగర్(కరీంనగర్): క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కరీంనగర్‌లోని అచీవర్స్ విద్యార్థులు శనివారం ఫైర్‌స్టేషన్, రైల్వేస్టేషన్‌లను సందర్శించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, జరుగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఫైర్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది విద్యార్థులకు వివరించారు. రైల్వేస్టేషన్‌లో రైలు ప్రయాణం, సరుకు రవాణా తదితర విషయాలను స్టేషన్ సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు ప్రిన్సిపాల్ పల్లవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న పురుమల్ల శ్రీనివాస్

కరీంనగర్‌రూరల్: మహిళలు స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ మండలం ఇరుకుల్లలో అభయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందుతున్న 38 మంది మహిళలకు గతంలో కుట్టుమిషన్లు అందించారు. శనివారం శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశంలో పాల్గొన్నారు. ఉచితంగా కుట్టుమిషన్లు అందించిన శ్రీనివాస్‌ను మహిళలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ ఆరుణ, ట్రైనర్ స్వప్న, కాంగ్రెస్ నాయకులు శంకర్‌గౌడ్, రాంరెడ్డి, తిరుపతి, మల్లేశం, వెంకటేశం, పలువురు మహిళలు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన విధంగా వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎడవెల్లి మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు రెడ్డి కార్పొరేషన్ ఊసేలేదన్నారు. తక్షణమే రూ.5000 కోట్లతో రెడ్డి కార్పొరేషన్ చేసి నిరుపేదలైన రెడ్డి కుటుంబాలకు అండగా ఉండాలని కోరారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు ఎవరికీ కేటాయించకుండా అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నిరుపేదలకు వెంటనే ఇళ్లు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుకూరి శ్రీనివాస్. మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మొగురం మీరియా, నాయకులు రాధిక, స్వాతి, రాంరెడ్డి, కనుకయ్య. కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.







దీపావళి వెలుగులు సరికొత్తగా

- ఆకట్టుకుంటున్న వెరైటీ ప్రమిదలు
- వివిధ ఆకృతుల్లో.. అందుబాటు ధరల్లో లభ్యం
- నగరంలో జోరందుకున్న వెలుగుల పండుగ వ్యాపారం



దీపాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

విద్యానగర్(కరీంనగర్): దీపావళి పండుగ అంటేనే దీపాలంకరణతో ప్రతి ఇల్లూ కళకళలాడాల్సిందే. చీకటికి వెలుగులు తెచ్చే పండుగగా.. విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకోవడం ఆనవాయితీ. దీపం వెలుగు శోభనే కాదు స్ఫూర్తిని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేస్తుంది. ఏ ఇంటిలో దీపాలు సమృద్ధిగా వెలుగుతాయో ఆ ఇంట శ్రీమహాలక్ష్మీ ప్రవేశిస్తుందని ఋగ్వేదం చెబుతోంది. దీపావళి రెండు రోజులు గృహాలు, వాణిజ్య వ్యాపార సముదాయాల్లో దీపాలు ఏర్పాటు చేసి లక్ష్మీదేవికి పూజలు నిర్వహించి సాదరంగా ఆహ్వానం పలుకుతారు.

వివిధ ఆకృతుల్లో అందమైన ప్రమిదలు

దీపావళి రోజున ముంగిళ్లలో అందమైన జ్యోతుల తోరణాలు వెలిగించేందుకు వివిధ ఆకృతుల్లో ప్రమిదలు లభిస్తున్నాయి. నాటి కాలం కుమ్మరి మట్టి ప్రమిదలతో పాటు రాజస్తాన్ నుంచి వచ్చిన వివిధ ఆకారాల్లోని దీపాలు, ఇన్‌స్టంట్ క్యాండిల్ ప్రమిదలు, ప్రమీదలపై దేవతా మూర్తుల విగ్రహాలతో విక్రయిస్తున్నారు. మామిడి కాయ, తమలపాకు, బాదంకాయ,, వినాయకుడు, లక్ష్మీదేవి తదితర దేవతా మూర్తుల విగ్రహాలతో కూడిన ప్రమిదలు ఆకట్టుకుంటున్నాయి.

నగరంలో జోరుగా విక్రయాలు

కరీంనగర్‌లోని డెయిలీ మార్కెట్, వీక్లీ మార్కెట్, పూజా సెంటర్లతో పాటు ప్రధాన రహదారులకు ఇరువైపుల ప్రమిదల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సాధారణ ప్రమిదలు రూ.5 నుంచి రూ.50 వరకు, ప్రత్యేక ఆకృతున్న దీపాల పంక్తుల ప్రమిదలు రూ.200 వరకు అమ్ముతున్నారు.

దీపకాంతులే ప్రత్యేకత



దీపావళి పండుగ ప్రత్యేకత లక్ష్మీపూజలు. చీకట్లను పారద్రోలే దీపకాంతులు. ప్రస్తుతం మార్కెట్‌లో వివిధ డిజైన్లు, ఆకృతుల్లో మట్టి ప్రమిదలు లభిస్తున్నాయి. చూడగానే ఆకట్టుకునే ఆకృతుల్లో ఉన్నా ధరలు కాస్తా ఎక్కువగా న్నాయి. – రాచమల్ల అనిత, గృహిణి, అశోక్ నగర్, కరీంనగర్

కొత్త డిజైన్లలో..



దీపజ్యోతిని పరబ్రహ్మ స్వరూపంగా, మనో వికాసానికి, ఆనందానికి, సజ్జనత్వానికి, సద్గుణ సంపత్తికి నిదర్శనంగా భావిస్తారు. ఈసారి కొత్త డిజైన్లలో దీపాలు వచ్చాయి. చూడగానే ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. దీపాల అలంకరణలో భిన్న ఆకృతుల ప్రమీదలు మరింత శోభను తీసుకువస్తాయి.
– పల్లెర్ల అపర్ణ, గృహిణి, కరీంనగర్

సౌభాగ్యానికి ప్రతీక



దీపం సౌభాగ్యానికి, సౌశీల్యానికి, సౌజన్యానికి ప్రతీక. ఆశ్వయుజ బహుళ చతుర్దశి నుంచి కార్తీక మాసమంతా సంధ్యా సమయంలో మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగిస్తారు. ఈ దీపాలను ముత్తయిదువులు కార్తీక పౌర్ణమి రోజున సముద్ర స్నానాలు ఆచరించి జీవనదులలో వదులుతారు.
– వాసాల స్నేహ, గృహిణి, వినాయక మార్కెట్, కరీంనగర్

వెరైటీ దీపాలు వచ్చాయి



దీపావళి పండుగ కోసం వివిధ రకాల కొత్త వెరైటీల్లో దీపాలు వచ్చాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పుడిప్పుడే అమ్మకాలు పెరుగుతున్నాయి.
– ఆశ, ప్రమిదల అమ్మకందారు, డైలీ మార్కెట్, కరీంనగర్



క్రీడాప్రాంగణంలో ధాన్యం కుప్పలు

కరీంనగర్‌రూరల్: అధికారుల పర్యవేక్షణలోపం, స్థానిక నాయకుల నిర్లక్ష్యవైఖరితో క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామీణ యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ గ్రామంలో తెలంగాణ క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసింది. అయితే గ్రామాలకు మంజూరైన స్పోర్ట్స్‌కిట్లను అధికారులు యువకులకు ఇవ్వకపోవడంతో క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం వానాకాలం సీజన్ వరికోతలు ముమ్మరం కావడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరపెట్టేందుకు స్థలాల కొరత ఏర్పడింది. కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లోని క్రీడాప్రాంగణంలో కొందరు రైతులు ధాన్యం పోసి ఆరబెడుతున్నారు. ప్రాంగణమంతా ఉన్న ధాన్యం కుప్పలతో యువకులు ఆటలు ఆడేందుకు అవకాశం లేకుండాపోయింది. అధికారులు స్పందించి క్రీడాప్రాంగణాలను సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని నాయకులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 94400 77555

సమాచారం

నేడు ఉమ్మడి జిల్లా సైకాలజిస్టుల సమావేశం

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ఉమ్మడి జిల్లా సైకాలజిస్టుల సమావేశం ఆదివారం నగరంలోని అల్ఫోర్స్ మెయిన్ క్యాంపస్‌లో మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎజ్రా మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోతుకురి రాంచందర్ హాజరవుతారని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని సైకాలజిస్టులతో పాటు మాస్టర్ డిగ్రీలో సైకాలజీ చేసిన వారు, ప్రస్తుతం సైకాలజీ చదువుతున్న విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

నేడు 'అలకలపోత' పుస్తకావిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: తెరవే కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత కవి తప్పెట ఓదయ్య రచించిన కవిత్వ సంపుటి 'అలకలపోత' పుస్తకాన్ని ఆదివారం ఫిలింభవన్‌లో ఆవిష్కరించనున్నట్లు తెరవే అధ్యక్షుడు సీవీ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ దళిత కవి కృపాకర్ మాదిగ ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాకథాన్

కరీంనగర్‌రూరల్: ప్రతిమ వైద్య విజ్ఞాన సంస్థ, ప్రతిమ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆదివారం కరీంనగర్‌లో వాకథాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి డీన్ వివేకానంద తెలిపారు. ఉదయం 6గంటలకు ఐఎంఏ బిల్డింగ్ నుంచి ప్రారంభించి గీతాభవన్, ప్రతిమ మల్టిప్లెక్స్, భగత్ నగర్ సర్కిల్ మీదుగా అంబేడ్కర్ స్టేడియంలో ముగుస్తోందని వివరించారు. వాకథాన్‌లో వైద్యులతో పాటు అధికారులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బ్లడ్ స్టోరేజీ

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజీ సెంటర్‌లో శనివారం వరకు ఏ పాజిటివ్ 13, బీ పాజిటివ్ 14, ఓ పాజిటివ్ 24, ఏబీ పాజిటివ్ 02, ఓ నెగెటివ్ 01 యూనిట్ల రక్తం అందుబాటులో ఉందని రెడ్‌క్రాస్ సెక్రటరీ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి తెలిపారు. అత్యవసరంగా రక్తం కావాల్సిన వారు ఫోన్: 95025 02942 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు

కొత్తపల్లి: విద్యుత్ చౌర్యానికి పాల్పడిన అద్వాల శ్రీనివాస్‌కు శుక్రవారం పెద్దపల్లి జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.హేమంత్‌కుమార్ మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.22,659 జరిమానా విధించినట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ షాదుల్లాబాబా తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా పరిధి బంధంపల్లి గ్రామానికి చెందిన అద్వాల శ్రీనివాస్ తన ఇంటికి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడడంతో విద్యుత్ ఆధికారులు పట్టుకొని విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అతనిపైన మొదటి నేరంగా 2017 డిసెంబర్ 28న కేసు నమోదు చేసి రూ. వెయ్యి జరిమానా విధించడంతో నేరం ఒప్పుకొని జరిమానా కట్టడంతో వదిలేశారు. 2018 మార్చి 24న మళ్లీ ఇంటికి అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడడంతో విద్యుత్తు ఆధికారులు పట్టుకొని విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్‌పై రెండో నేరంగా కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు. దీనిపై విచారణ జరిపిన జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.హేమంత్ కుమార్ రూ.22,659 జరిమానాతో పాటుగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష విధించారని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం వివాదాస్పదం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్యాంసుందర్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్, దుర్శేడ్ ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం వివాదాస్పదమైంది. శనివారం దుర్శేడ్ సంఘం ఆధ్వర్యంలో చేగుర్తి, ఇరుకుల్ల, కరీంనగర్ సంఘం ఆధ్వర్యంలో చెర్లభూత్కూర్, తాహెర్‌కొండాపూర్, దుబ్బపల్లి, నగునూరుల్లోని కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌తో కలిసి చైర్మన్లు తోట తిరుపతి, పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డిలు ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. అయితే కాంగ్రెస్ నాయకులతో కలిసి బీఆర్ఎస్ సొసైటీ చైర్మన్లు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం వివాదాస్పదంగా మారింది. కాగా మొగ్దుంపూర్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి కేంద్రాన్ని ప్రారంభించేందుకు బీఆర్ఎస్ నాయకులు వ్యతిరేకించడంతో వాయిదా వేయడం గమనార్హం. ఈ కార్యక్రమాల్లో సొసైటీ వైస్ చైర్మన్లు గోనె నర్సయ్య, బీరం ఆంజనేయులు, సీఈవోలు రమేశ్, వేణుమాధవ్, ఏవో సత్యం, కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి, ఎస్. తిరుపతి, బి.మల్లేశం, వెంకటేశం గౌడ్, కె.నరేశ్‌రెడ్డి, నారాయణ, ఎం.రంగయ్య, బీఆర్ఎస్ నాయకులు రంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సతీశ్, ప్రవీణ్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బల్దియా ఆర్‌ఓ బదిలీ

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారి గణేశ్‌రెడ్డి బదిలీ అయ్యారు. తూప్రాన్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా నగరపాలకసంస్థలో ఇద్దరు ఆర్‌ఓలకు ఇప్పటికే ఒక ఆర్‌ఓ ఆంజనేయులు బదిలీపై వెళ్లగా, తాజాగా మరో ఆర్‌ఓ గణేశ్‌రెడ్డి కూడా బదిలీ కావడంతో రెండు ఆర్‌ఓ పోస్టులు ఖాళీ అయ్యాయి.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ గీతారెడ్డి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శనివారం ప్రతిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో రొమ్ము స్క్రీనింగ్, అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ గీతారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రొమ్ము కేన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేసే అవకాశముందన్నారు. మహిళలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం రొమ్ము క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాలతి, వైస్ ప్రిన్సిపాల్ సమత, వైద్యాధికారి చైతన్య, ఎన్ఎస్ఎస్ పీవో గీతారాణి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పరామర్శ



కరీంనగర్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబాన్ని శనివారం పలువురు నాయకులు పరామర్శించారు. సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, నాయకులు బోయిని అశోక్, పెడిపల్లి రాజు, సదాశివ, ఎస్సార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, సాహితీవేత్త గండ్ర లక్ష్మణరావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజుతో పాలకవర్గ సభ్యులు, సిరిసిల్ల పట్టణం మున్నూరు కాపు సంఘం నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు, పలువురు నాయకులు లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పిడికెడు బియ్యం

- వివేకానంద విద్యానికేతన్ విద్యార్థుల వినూత్న కార్యక్రమం
- ప్రభుత్వాసుపత్రిలోని రోగుల సంబంధీకులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న విద్యార్థులు

విద్యానగర్(కరీంనగర్): వారు ఏడో తరగతి విద్యార్థులు, ఒకటిగా కలిసారు. చేయిచేయి కలిపారు. తమ ఇంటి నుంచి తల పిడికెడు బియ్యం, దానికి తోడుగా కూరగాయలు, నిత్యావసర వస్తువులు తల్లిదండ్రుల సహకారంతో తీసుకొచ్చారు. వంటలు వండారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి సంబంధికులకు అన్నదానం చేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌లోని వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు శనివారం తల్లిదండ్రుల సహకారంతో ఇంటి నుంచి తల కొంత బియ్యం, కూరగాయలు, ఇతర దినుసులు తీసుకొచ్చి పాఠశాలలో వంటావార్పు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగుల సంబంధికులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కొమురయ్య మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలోని స్థితిగతులు తెలుసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మిథున్ జే మిస్త్రీ, ఏవో తుంగాని సంపత్, వైస్ ప్రిన్సిపాల్ సాగర్, ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, స్నేహ, శ్రావణి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కరీంనగర్‌కల్చరల్: ఐక్యరాజ్యసమితి దినం, ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవర్ధన్‌రావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శరత్‌కృష్ణ, శివకాంత్, ప్రోగ్రాం చైర్మన్ సింగమరాజు, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం

- అకాల వర్షాలతో వరిపంట కోసేందుకు ఆటంకం
- కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో జాప్యం
- రైస్‌మిల్లుల కేటాయింపులో గందరగోళం
- మిల్లర్లకు ధాన్యం విక్రయిస్తున్న రైతాంగం



మొగ్దుంపూర్‌లో వరి కోస్తున్న ట్రాక్ మిషన్

కరీంనగర్‌రూరల్: జిల్లాలో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు మరింత ఆలస్యం కానున్నాయి. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలకు రైసుమిల్లుల కేటాయింపు జరగకపోవడంతో కేంద్రాలను ప్రారంభించేందుకు అధికారులు ముందుకు రావడంలేదు. అక్టోబరు మూడో వారం ముగుస్తున్నప్పటికీ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ఇంకా ప్రారంభించలేదు. దీపావళి పండుగ తర్వాతే కొనుగోళ్లు చేపట్టాలని అధికార యంత్రాంగం నిర్ణయించినట్లు తెలుస్తోంది. జిల్లాలో వానాకాలంలో 2.75 లక్షల ఎకరాల్లో రైతులు వరిపంట సాగు చేశారు. సన్నరకం 1.18 లక్షల ఎకరాలకు 3.31 లక్షల క్వింటాళ్ల దిగుబడి, దొడ్డు రకం 1.56 లక్షల ఎకరాల్లో 7.90 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. మొత్తం 348 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

అకాల వర్షాలతో కోతలకు ఆటంకం

వరిపంట కోత దశకు వచ్చిన తరుణంలో అకాల వర్షాలు అన్నదాతలను వెంటాడుతున్నాయి. వర్షానికి ఒకవైపు వరిపంట నేలకొరుగుతుండగా మరో వైపు పొలాల్లో తడి ఆరడం లేదు. దీంతో బురద, తడినేలలు, నీటితో ఉన్న పొలాల్లోకి ఫోర్‌వీలర్, ట్రాక్ హార్వెస్టర్లను వరికోతలకు ఉపయోగించాల్సిన పరిస్థితి నెలకొంది. వరికోతలకు సాధారణంగా టూ వీలర్ హార్వెస్టర్లను వినియోగిస్తారు. వర్షాలతో తప్పనిసరిగా ట్రాక్ హార్వెస్టర్లతోనే వరిపంటను కోయాల్సి వస్తోంది. టూ వీలర్ హార్వెస్టర్‌కు గంటకు రూ.2 వేల నుంచి రూ.2,220, ఫోర్ వీలర్‌కు రూ.2,300, ట్రాక్ హార్వెస్టర్‌కు రూ.3వేల చెల్లిస్తున్నారు. దీంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది.

సన్నాలను విక్రయిస్తున్న రైతాంగం

కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించాలంటే ఎఫ్‌సీఐ నిబంధనల ప్రకారం ధాన్యం తేమశాతం 17 లోపుండాలి. అయితే రైతులు హార్వెస్టర్లతో వరిపంటను కోసి నేరుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. కేంద్రాల్లో ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320, కామన్ గ్రేడ్‌కు రూ.2,300 మద్దతు ధర చెల్లిస్తోంది. సన్నాలకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తోంది. అయితే అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరపెట్టేందుకు రైతులు పడరానీపాట్లు పడుతున్నారు. కూలీలతో ధాన్యం ఆరపెట్టేందుకు ఖర్చు, కుప్పలపై కప్పేందుకు తీసుకొచ్చే టార్పాలిన్ల అద్దెను చెల్లించడం భారంగా మారాయి. కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కాకపోవడంతో రైతులు సన్నవడ్లను నేరుగా రైసు మిల్లర్లకు విక్రయిస్తున్నారు. వరికోతల ప్రారంభంలో మిల్లర్లు సన్నాలను ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్నాలకు ప్రభుత్వం చెల్లించే మద్దతు ధర, బోనస్‌ను కలుపుకుంటే రూ.2,820 ధర ఉండగా మిల్లర్లు రూ.2,500 నుంచి రూ.2,600వరకు చెల్లిస్తున్నారు.దీంతో సన్నాలను సాగు చేసిన పలువురు రైతులు మిల్లర్లకు విక్రయించేందుకు మొగ్గుచూపుతున్నారు.

మిల్లర్‌కు విక్రయించా..



వారం రోజుల క్రితం ఏడు ఎకరాల్లోని సన్న వరిపంటను కోసి కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చా. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు పలు ఇబ్బందులు ఎదుర్కొన్న. క్వింటాల్‌కు రూ.2,600 చొప్పున మొత్తం 170 క్వింటాళ్ల ధాన్యాన్ని రైసుమిల్లరుకు విక్రయించా.
– దబ్బెట రమణారెడ్డి, రైతు, చెర్లభూత్కూర్

అదనపు భారం..



అకాల వర్షానికి నాలుగు ఎకరాల పొలమంతా బురదగా మారింది. మామూలు మిషన్‌తో వరికోసే అవకాశం లేకపోవడంతో చైన్ మిషన్‌తో కోయించా. గంటకు రూ.3,200 చొప్పున 5గంటలకు రూ.16వేలు కిరాయి చెల్లించాను. రూ. 5వేల వరకు అదనంగా భారం పడింది.
– ఇరుమల్ల మహేశ్, రైతు, చెర్లభూత్కూర్

'ప్రైవేటు టీచర్లకు అండగా ఉంటా'



మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

కరీంనగర్: ప్రైవేటు స్కూల్ టీచర్లకు అన్ని విధాలా అండగా ఉంటానని మాజీ మేయర్ రవీందర్‌సింగ్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పలు ప్రైవేటు పాఠశాలల్లో ఓటరు నమోదుపై ప్రచారం నిర్వహించారు. 2021లోపు డిగ్రీ పూర్తి చేసిన వారందరూ తమ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రయివేట్ టీచర్స్ సమస్యలను పట్టభద్రుల, నిరుద్యోగుల, సమస్యలను మండలిలో మాట్లాడి పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు విద్యాసంస్థల ప్రతినిధులు గంజి స్వరాజ్‌బాబు, చుక్కరెడ్డి, మల్లికార్జున్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కటకం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.